క్లుప్తంగా

మూడురోజులుగా తాగునీటి కష్టాలు



మరమ్మతుల్లో బోరుబావి

సాలూరు రూరల్: మండలంలోని దేవుబుచ్చింపేట గ్రామంలో మూడురోజులుగా గ్రామస్తులు తాగునీటి కష్టాలు పడుతున్నారు. గ్రామానికి నిత్యం తాగునీరు అందించే బోరుబావి మరమ్మతుల బారిన పడడంతో ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. దగ్గరలో ఉన్న పొలాల్లోని బోరుబావుల వద్ద తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తుందని చెబుతున్నారు. వెంటనే మోటారు మరమ్మతులు చేసి తాగునీరు అందించాలని కోరుతున్నారు.

దేవస్థానం భూముల కౌలుకు వేలం

సాలూరు: పట్టణంలోని పెదకోమటిపేట సీతారామస్వామిదేవస్థానానికి చెందిన, పాచిపెంట మండలం పి.కోనవలసలో గల భూముల కౌలుకు సోమవారం వేలం పాట నిర్వహించారు. పట్టణంలోని సీతారామస్వామి దేవస్థానం, పెదకోమటిపేట వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పి.కోనవలసలో గల సర్వే నంబ 70/1.2,79/1,99,452/2.7 ర్లలో సుమారు 6.53 ఎకరాల విస్తీర్ణం భూములకు వేలం జరిగింది. ఏడాదికి రూ.36 వేలు చొప్పున 3 సంవత్సరాలకు పెదకోమటిపేటకు చెందిన బలభద్రుని శ్రీనివాసరావు వేలం పాట పాడినట్లు ఈఓ రమేష్ తెలిపారు.

రేణుకాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న రేణుకాదేవి అమ్మవారు

కురుపాం: స్థానిక శ్రీషిర్డీసాయి, ద్వారకామయి ఆలయ ప్రాంగణంలో వెలసిన శ్రీరేణుకాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గాయత్రీ పంచకుండముల హోమం భక్తిశ్రద్ధలతో చేశారు. మధ్యాహ్న భక్తులకు అన్నదానం చేశారు.

కూరాకుల కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా



టి.లక్ష్మణరావు

పాలకొండ: కూరాకుల కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి తాను రాజీనామా చేసినట్లు స్థానిక పట్టణానికి చెందిన తూముల లక్ష్మణరావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పదవిని తనకు ఇచ్చారన్నారు. తన రాజీనామా లేఖను ఇప్పటికే అధిష్టానానికి పంపించానన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

గరుగుబిల్లి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, ప్రతిఒక్కరూ ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు ఎస్.సంతోష్‌కుమార్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రిజమ్–10 కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు అందిస్తున్న వైద్యసేవలపై వైద్యారోగ్య సిబ్బందిని ఆయన ఆరాతీశారు. అనంతరం మాతాశిశు సంరక్షణ కార్డులో పేర్కొన్న, చేసిన ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలు గమనించి, హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గర్భిణులు తరచూ నీరు, ద్రవరూప ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ చింతాడ ఉదయకుమారి, ల్యాబ్ టెక్నీషయన్ టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

రాజాం సిటీ: పాలథిన్ విక్రయిస్తున్న పలు దుకాణాల్లో స్థానిక మున్సిపల్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిషేధిత పాలిథిన్ సంచులను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. శ్రీనివాసరోడ్డు, బజారు, మాధవబజారు తదితర ప్రాంతాల్లోని దుకాణాల్లో తనిఖీలు చేపట్టిన వారు.. పాలిథిన్ కవర్ల అమ్మకాలపై నిషేధం ఉన్నా విక్రయాలు చేపట్టడం సరికాదని దుకాణదారులను హెచ్చరించారు. మరోసారి ఇదే తీరు పునరావృతమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ దుకాణంలో గుడ్డసంచులే విక్రయించాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డు శానిటేషన్ కార్యదర్శులు సురేష్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు సైనికుడిలా శ్రమిస్తా

● మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ ఓటమిని చవిచూసినప్పటికీ జగనన్నకు సైనికుడిలా నిరంతరం శ్రమిస్తానని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలో గల వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి క్యాంప్ కార్యాలయంలో ఓటమికి గల కారణాలతో పాటు భవిష్యత్ కార్యాచరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనాకాలంలో మన శక్తికి మించి నియోజకవర్గ ప్రజలందరికీ విశేష సేవలు అందించినప్పటికీ రాష్ట్ర స్థాయి నుంచి వచ్చిన వేవ్‌లో మన నియోజకవర్గంలో కూడా ఓటమిని చవిచూడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. మనమందరం ప్రజాతీర్పును గౌరవిసూ..మన వైపు నిలిచిన 60 వేల మంది ఓటర్లతో పాటు నియోజకవర్గ ప్రజలకు అండగా నిలవాల్సిన బాధ్యత మనపై ఉన్నదన్నారు.

ప్రజాసమస్యలపై పోరాటం

మరికొద్ది నెలల్లోనే ప్రజల పక్షాన వారి సమస్యలపై ప్రజా గొంతుకగా నిలిచి పార్టీకి మళ్లీ పూర్వ స్థితికి తీసుకు వచ్చేందుకుగాను ప్రతి ఒక్కరం ధైర్యంగా నిలబడి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కొద్ది నెలల పాటు వేచి చూసిన అనంతరం ఎక్కడైనా ప్రజా సమస్యలు తారస పడితే వారి పక్షాన మనం నిలిచి, మనతో కలిసి వచ్చిన వారితో ముందుకు సాగితే మళ్లీ మన పార్టీకి పూర్వస్థితికి తీసుకువచ్చేందుకు ఎంతో సమయం పట్టదని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ గెలిచినా ఓడిన తాను ఎప్పుడూ జగనన్నకు మద్దతుగా నిలిచి పార్టీకి సాధారణ కార్యకర్తలా పని చేస్తానని స్పష్టం చేశారు. విరామం అన్నపదం లేకుండా మీతోనే నిలిచి, మీ వెంటే ఉంటానని కేడర్‌కు పూర్తిస్థాయి భరోసా కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్‌లు కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవ రావు, పార్టీ సీనియర్ నాయకులు, వార్డుల కౌన్సిలర్‌లు, వార్డుల ఇన్‌చార్జిలు, కన్వీనర్లు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దోమల నివారణకు పారిశుద్ధ్య పనులు



పంచాయతీ రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు

సీతానగరం: వర్షాకాలంలో వచ్చే దోమల నివారణకు ముందు జాగ్రత్తచర్యగా మండలంలోని పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించడానికి ప్రాదాన్యం ఇవ్వాలని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ సహాయకులతో సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ వర్షాకాలంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని, దోమలు రాత్రిపూట కుట్టడం వల్ల వివిధ రకాల వ్యాధుల బారిన ప్రజలు పడే అవకాశం ఉంద న్నారు. గ్రామాల్లో దోమలనివారణకు ప్రత్యేక డ్రైవ్ సామూహికంగా నిర్వహించి నివారించాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు నిర్వహించడంతో పాటు కాలువల్లో పూడికలు తీయించాలని, తీయించిన పూడికలు దూర ప్రాంతాలకు తరలించాలని కోరారు.

చెత్తకుప్పలు తొలగించిన వెంటనే దోమల నివారణ మందును స్ప్రే చేయించాలని చెప్పారు. అలాగే పశువుల శాలలున్న ప్రాంతాల రైతులతో దోమల నివారణకు సదస్సులు నిర్వహించి దోమల బెడద నివార ణకు సహకరించే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. పాఠశాలలు తెరిచే సమయం ఆసన్నమవడం వల్ల విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉండాలని, ఆదాయ, కుల, నివేశ ధ్రువీకరణ పత్రాల పంపిణీలో జాప్యం ఉండరాదని సూచించారు. అందుకు డిజిటల్ సహాయకులు, వేల్ఫేర్ సహాయకులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ సహాయకులు పాల్గొన్నారు.

పొదుపుసంఘాల బలోపేతమే లక్ష్యం



మాట్లాడుతున్న ఏపీఎం ఆర్.శ్రీరాములు

● వీఓఏలతో ఏపీఎం రెడ్డి శ్రీరాములు

సీతానగరం: మండలంలోని గ్రామైక్యసంఘాల వీఓఏలు పొదుపు సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు కోరారు. ఈ మేరకు సోమవారం వెలుగు మండలసమాఖ్య కార్యాలయంలో క్లస్టర్ సీసీలు, వీఓఏలతో సమీక్షాసమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీఓఏలు గ్రామాల్లో చిన్న పొదుపు సంఘాల సభ్యులతో ఆర్థిక పరిస్థితులపై అవగాహన కల్పించడంతోపాటు గ్రామాల్లో పెద్దసంఘాల సభ్యులు పొందుతున్న లబ్ధిపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. వారికి బ్యాంక్‌లు ఇస్తున్న రుణాలు, పొదుపుపట్ల తెలియజేసి సంఘసభ్యులను ఆర్థికంగా బలోపేతం చేయాలని కోరారు. అలాగే ఈ ఏడాదిలో పొదుపు సంఘాల ఆర్థికాభివృద్ధి నిమిత్తం రూ.5 కోట్లు స్త్రీనిధి రుణాలు సమకూర్చాలని నిర్ధారించామని చెప్పారు. బ్యాంక్ లింకేజ్ రుణాలు, స్త్రీనిధి రుణాలు సక్రమంగా లావాదేవీలు నిర్వహించడానికి వీఓఏలు కృషి చేయాలని, పొదుపు సంఘాల సభ్యులందరూ ప్రభుత్వం నుంచి ఆర్థికంగా లబ్ధి పొందే విధంగా సభ్యులను చైతన్య పర్చాలని సూచించారు. ప్రతి గ్రామంలో చిన్నపొదుపు సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహించి ఆర్థికంగా లబ్ధిపొందే విధంగా సీసీలు చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధులు, సీసీలు అనందరావు, అప్పలనాయుడు, కోటేశ్వరరావు, వీఓఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల కళాశాలల్లో సీట్లు పెంచాలి



ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజన సంఘం నాయకులు

పార్వతీపురంటౌన్: గిరిజన గురుకుల కళాశాలల్లో సీట్లు పెంచాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన గిరిజన విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గురుకుల కళాశాలల్లో అవసరమైనన్ని సీట్లు పెంచాలని కోరారు. సీట్లు రాక అనేక మంది పేద గిరిజన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

విచారణ జరిపించాలి

పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో జరిగిన సీఆర్టీల రెగ్యులరైజేషన్ ప్రక్రియ కోసం డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని వినతిపత్రం అందజేశామని రంజిత్ కుమార్ తెలిపారు. బాలికల పాఠశాలల్లో పురుష ఉపాధ్యాయు లను నియమించిన డీడీ, సూపరింటెండెంట్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యేసుక్రీస్తు సంగీత సువార్త పరిశుద్ధాత్మ పండగ

సాలూరు: పట్టణంలో మక్కువ బైపాస్‌రోడ్డు వద్ద మంగళవారం, బుధవారం యేసుక్రీస్తు సంగీత సువార్త పరిశుద్ధాత్మ అభిషేక పండగలు నిర్వహి స్తున్నట్లు మండల కో ఆప్షన్ సభ్యుడు పాస్టర్ సువార్తరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన పట్టణంలో మాట్లాడుతూ, ఈ రెండు రోజుల్లో సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. వాక్యోపదేశకులుగా ప్రముఖులు రానున్నారని చెప్పారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

పాలకొండ రూరల్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో వాహిని హెచ్చరించారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో రైతులతో సమావేశమైన ఆమె.. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు షాపులకు వెళ్లినప్పుడు ఆ విత్తనాలు, ఎరువులకు సంబంధించిన రశీదులు తీసుకోవాలన్నారు. అలాగే లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే ఎరువులు, విత్తనాలు కొనాలన్నారు. దుకాణాదారులు కూడా రైతులను మోసగిస్తే సహించమన్నారు.

మలేరియా నిర్మూలనకు చర్యలు తీసుకోండి

సీతంపేట: మలేరియా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో గీతాంజలి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశమైన ఆమె.. ప్రతీ గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, అలాగే గ్రామస్తులకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరా ల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. కాలువలు, మురుగునీటి నిల్వ లు వద్ద దోమలు పెరగకుండా దోమల నివార ణ మందు పిచికారీ చేయాలని తెలిపారు. సమావేశంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీ సర్ జె.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

సీతంపేట: మండలంలోని కలువరాయి గ్రామంలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్లు ఎ. చిరంజీవి రావు, పి.నాగేశ్వరరావు కలిసి ప్రకృతి వ్యవసాయ విధానాలు, నారుమడి తయారీని రైతులకు వివరించారు. ప్రకృతి సేద్యంలో భాగంగా ప్రధాన పంట వేసుకోవడానికి ముందు పచ్చిరొట్ట విత్తనాలు గానీ, నవధాన్యాలు గానీ పొలంలో వేసుకుని, అవి మొక్కలైన తర్వాత నేలలో కలియదున్నాలన్నారు. దీంతో నేల సారవంతమై పంట బాగా పండుతుందన్నారు. కార్యక్రమంలో మొబలైజర్ రవికుమా ర్, జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా రేపు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐలో ఈ నెల 12వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఈ జాబ్‌మేళాలో ఎంపికైన వారికి ప్రముఖ ఎల్అండ్‌టీ కంపెనీలో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, డ్రాఫ్ట్‌సమన్ సివిల్ ట్రేడ్‌ల యందు ఐటీఐ ఉత్తీర్ణులైన వారితో పాటు ప్రస్తుతం ఐటీఐ సెకండియర్ చదువుతున్న వారు, పాలిటెక్నిక్ పాసైన వారు, డిప్లమో ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీరింగ్ చదివిన వారితో పాటు ఇంటర్మీడియట్, టెన్త్ పాసైన వారు కూడా ఈ జాబ్‌మేళాకు హాజరుకావచ్చన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆరోజు ఉదయం 10 గంటలకు ఐటీఐని సంప్రదించాలన్నారు.

చెట్లకింద సేదదీరుతున్న గ్రామస్తులు



ఎండకు మధ్యాహ్నం వేళ చెట్ల కింద సేదదీరుతున్న గ్రామస్తులు

సాలూరు రూరల్: రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించాయని మూడురోజుల నుంచి వాతావరణ శాఖ చెబుతున్నప్పటికీ ఇంతవరకు వర్షాలు కురవలేదు సరికదా ఎండలు తీవ్రంగా మండుతున్నాయి. గ్రామాల్లో ప్రజలు ఇళ్లలో ఉండలేక రోడ్లపై తిరగలేక ఆపసోపాలు పడుతున్నారు. ఈ క్రమంలో గ్రామాల్లో ప్రజలు భారీ వృక్షాల కింద సేదదీరుతున్నారు. గడిచిన వారం రోజులుగా కనీసం ఒక్క రోజు కూడా చల్లటి వాతావరణం చవిచూడని జనం వర్షం ఎపుడు కురుస్తోందోనని ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఎండవేడిని తట్టుకోలేక అల్లాడిపోతున్నారు. సాలూరు మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. అలాగే కొంతమంది వేడికి ఇళ్లలో ఉండలేక చెట్ల కింద సేదదీరడం కనిపిస్తోంది.

స్త్రీ, పురుషులు సమాన హక్కులు కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌డీ ఏపీఎం త్రినాథమ్మ

బలిజిపేట: సమాజంలో స్త్రీ, పురుషులు సమానహక్కులు కలిగిఉండాలని మానవవనరుల అభివృద్ధి (హెచ్‌డీ) ఏపీఎం త్రినాథమ్మ తెలిపారు. ఈ మేరకు మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్త్రీలు అన్ని రంగాల్లో పురుషులతో సమాన హక్కులు పొందాలని, జీవనప్రమాణాలు పెంచుకోవాలని పిలుపు నిచ్చారు. అభివృద్ధి ప్రణాళికలలో బాధ్యులై సమాజాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆమె తెలిపారు. అందుకు అందరు మహిళలు ముందుకు వచ్చేలా గ్రామ సంఘాల అధ్యక్షులు పాటుపడాలని ఆమె తెలి పారు. ఐబీ ఏపీఎం జయమ్మ, ఇన్సూరెన్స్ ఏపీఎం రాణీరుద్రమ్మ, మండ ల ఏపీఎం ఉమామహేశ్వరరావు, మండలసమాఖ్య అధ్యక్షురాలు మేరీ, సీసీలు, గ్రామ సంఘాల అధ్యక్షుడు పాల్గొన్నారు.

వెలవెల బోతున్న చెరువులు



పెదపదం వద్ద నీరు లేక వెలవెలబోతున్న చెరువు

సాలూరు రూరల్: రుతుపవనాలు వచ్చాయి. వర్షాలు కురుస్తాయని ఎదురు చూస్తున్న రైతులకు కొద్ది రోజులుగా నిరాశే ఎదురవుతోంది. ఎండలు తీవ్రంగా మండుతుండడంతో కనీసం సాయంత్రమైనా వర్షం కురుస్తుందని ప్రతిరోజూ ఊహిస్తున్న రైతులకు ఆజాడ కనిపించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇంతవరకు సరైన వర్షం కురవకపోవడంతో మండలంలోని చెరువులు, చిన్న చిన్న గెడ్డలు నీరులేక వెలవెల బోతున్నాయి. ఇంతవరకు ఉపాధి కూలీలతో చెరువుల్లో ఉన్న పూడికలు, తొలగించడంతో శుభ్రంగా కనిపిస్తున్న చెరువులు ఎప్పుడు వర్షం కురుస్తుందా? నీళ్లతో కళకళలాడుదామా అన్నట్లుగా ఎదురుచూస్తున్నాయి. రైతులు మాత్రం తొలి దుక్కులు పూర్తిచేసి ఎప్పుడు వర్షం పడితే అప్పుడు విత్తనాలు నాటేందుకు సిద్ధంగా ఉన్నారు.

● నిర్మానుష్యంగా రోడ్లు



నిర్మానుష్యంగా భామిని పట్టణ ప్రధాన రోడ్డు



జనసంచారం లేని వీధిరోడ్డు

వేసవి ఎండల తీవ్రత రోజురోజుకూ ఎక్కువవుతుండడంతో ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు జనాలు భయపడుతున్నారు. ఉదయం 10 గంటల నుంచే ఎండ, వేడిగాలులు విపరీతంగా ఉండడంతో అత్యవసరమైతే తప్ప ఎవరూ రోడ్లు మీదికి రావడం లేదు. దీంతో రోడ్లు, ప్రధాన వీధులు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. – భామిని

అంతర్‌రాష్ట్ర రహదారి మరమ్మతులు చేపట్టండి



కొమరాడ దగ్గరలో రహదారిపై ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు, కార్యకర్తలు

కొమరాడ: పార్వతీపురం-కూనేరు అంతర్‌రాష్ట్ర రహదారి మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి కోరారు. మండల కేంద్రానికి దగ్గరలోని గోతలమయమైన రహదారి వద్ద కొంతమంది వాహనదారులు, ప్రయాణికులతో కలిసి ఆయన ఆందోళనకు దిగారు. రోడ్డు అధ్వానంగా తయారైందని, దీంతో అటువైపుగా వెళ్లే వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపెద్ద గోతుల్లో భారీ వాహనాల టైర్లు ఇరుక్కుపోవడంతో అప్పుడప్పుడూ ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తలెత్తుతున్నాయన్నారు. ఇదే విషయమై ఆర్అండ్‌బీ అధికారులను సంప్రదించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇదే రహదారి మీదుగా ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాలకు భారీ వాహనాలు ప్రయాణిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, రహదారిని బాగుచేయాలని విజ్ఞప్తి చేశారు.

మట్టి నమూనాల సేకరణ



మట్టి పరీక్షలతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: మండలంలోని కోడిశ గ్రామ పొలాల్లో మట్టి నమూనాల సేకరణ సోమవారం చేపట్టారు. ఏవో జి.మురళీకృష్ణ మాట్లాడుతూ మట్టి పరీక్షలు చేసుకుంటే ఏ నేల ఏ పంటకు అనుకూలమో తెలుస్తుందన్నారు. ప్రతీ రైతు తమ పొలంలో పంట వేసే ముందు ఆ పొలంలోని మట్టిని ల్యాబ్‌కు తరలించి, పరీక్షలు చేయించాలని సూచించారు. నేలసారం ఆధారంగా పంట వేసుకుంటే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. తెగుళ్ల, చీడపీడల నుంచి పంట తట్టుకోగలదన్నారు. కార్యక్రమంలో శరత్‌బాబు, బి.సూర్యనారాయణ, సాయిమణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



లబ్ధిదారులకు పౌష్టికాహారం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెర్లాం–5 అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి అన్నారు. ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో కె.రాజ్యలక్ష్మి, తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి ఆదేశాల మేరకు లబ్ధిదారులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం సోమవారం కేంద్రంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె.. లబ్ధిదారులకు పాలు, గుడ్లు తదితర పౌష్టికాహార పదార్థాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్రతినెలా ప్రభుత్వం అందిస్తున్న ఈ పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న ఈ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటున్నారన్నారు.